

'విత్తనాల వరి' కోతల ప్రారంభం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో ఉసులుమర్రు, తీపర్రు, కానూరు తదితర గ్రామాల్లో విత్తన వరి కోతలు ప్రారంభమయ్యాయి. వీటిని కోత మిషన్లతో కోస్తున్నారు మండల పరిధిలో ఉన్న మూడు గ్రామాల్లో రైతులు ఎక్కువగా సార్వా, దాళ్వా రెండు సీజన్లలో వ్యవసాయ అధికారులు సూచన మేరకు పలు నూతన విత్తన వరి రకాలు సాగు చేస్తున్నారు. ఇక్కడ పండిన వరి విత్తనాలను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఎక్కువగా కొనుగోళ్లు చేస్తారు. రైతుల వద్దనే నేరుగా కొనుగోళ్లు చేసుకుని వెళ్తుంటారు. కొత్త వరి వంగడాలను అధికారులు సూచనల మేరకు ఇక్కడ రైతులు సాగు చేయడం కొంతకాలంగా ఆనవాయితీగా వస్తుంది.

చికెన్ ధరలు ఢమాల్

- కార్తీక మాసం ఎఫెక్ట్‌తో నేల చూపులు
- రిటైల్ ధర రూ.180, లైవ్ రూ.140
- నష్టాల బాటలో పౌల్ట్రీ రైతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

చికెన్ ధరలు నేలను తాకాయి. రిటైల్ ధర రూ.180 కాగా లైవ్ చికెన్ రూ.140 మించడంలేదు. రైతు ధర రూ.108కి చేరింది. కార్తీక మాసం ప్రభావంతో ధరలు నేల చూపులు చూస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఓ వైపు పెరుగుతున్న మేత ధరలు, విద్యుత్ ఛార్జీలకు తోడుగా కోళ్ల ధరలు నిలకడలేమి వంటి పరిణామాలు ఈ పరిశ్రమపై ఆధార పడిన వారి భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతున్నాయి. ఏడాదిలో మూడు నెలలు పౌల్ట్రీ పరిశ్రమ ఆశాజనకంగా ఉంటుంది. మిగతా తొమ్మిది నెలల పాటు అటు ఇటుగా పరిస్థితి ఉంటుంది. కోళ్ల పెంపకానికి అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయానికి సరిపోతుండటంతో శ్రమ వథా అవుతుందని పౌల్ట్రీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉండగా, దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. కిలో కోడి పెంపకానికి, మార్కెట్ చేరుకోవడానికి రవాణా ఖర్చు రూ.120 కాగా రైతు ధర రూ.108 నుంచి రూ.130లకు మాత్రమే పరిమితమవుతోంది. కేజీ బాయిలర్ కోడి శనివారం రైతు ధర రూ.108 కాగా రిటైల్ ధర రూ.140కి చేరింది. కేజీ చికెన్ ధర రూ.180 కాగా స్కిన్ లెస్ రిటైల్ మార్కెట్లోరూ.200 చొప్పన విక్రయాలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 300 పౌల్ట్రీ ఉండగా, 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. రాష్ట్రంలో ఐదు కోట్ల కోళ్ల పెంపకం సరాసరిగా ఉత్పత్తి జరుగుతుందని అంచనాగా తెలుస్తుంది. దీనిలో 30శాతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉత్పత్తి జరుగుతుంది. ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమకు లారీ పరిశ్రమ అనుబంధంగా ఉపాధి లభిస్తుంది. రైతుల వద్ద కోళ్లను కొనుగోలు చేసి లారీ యాజమాన్యాలు ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాయి. అత్యధికంగా ఎగుమతి జరిగే బీహార్, బెంగాల్, ఒడిశా ప్రాంతాల్లో అక్కడ ప్రభుత్వాలు ప్రోత్సాహం ఫలితంగా పౌల్ట్రీ ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. ఈ ప్రభావం జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమపై గోరుచుట్టుపై రోకలి పోటు లా మారింది. గత రెండేళ్లుగా కోళ్ల ఫారాలలో బ్యాచ్‌లు వేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఏటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవటం రాబడి క్రమ క్రమంగా తగ్గిపోవటమే కారణమని రైతులు చెబుతున్నారు.

కోడి పిల్ల ధర రూ.35 కాగా లేబర్ చార్జీ రూ.6,మెడిసిన్ ఖర్చు రూ.10, కరెంట్ బిల్లు రూ.1, వరిపొట్టుకు రూ.5,ఇతర ఖర్చులు రూ.3, ట్రేడర్ తరుగుదల కింద రూ.40, మొత్తంగా రెండు కిలోల కోడి పెంపకానికి రూ.240 ఖర్చు అవుతోంది.కిలో లైవ్ కోడి రూ.130 చొప్పున విక్రయిస్తే కొంత మేర ఆశాజనకంటా ఉన్నట్లేనని రైతులు చెబుతున్నారు. కోళ్లఫాంలో 10వేల కోళ్లను పెంచితే కోడికి(2కిలోలు) రూ.240 చొప్పున రెండు నెలలకు సుమారు రూ.24లక్షల ఖర్చుఅవుతోంది. కోళ్ల పెంపకానికి మొక్కజొన్న, సో యా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18వేల నుంచి రూ.25వేలు, సోయా రూ.50వేల నుంచి రూ.80వేలకు పెరిగింది. దీంతో దాణా ఖర్చు రెట్టింపైంది. అదే స్థాయిలో కోడి ధర పెరగకపోవడంతో నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు.సాధారణంగా రెం డు కిలోల కోడిగా ఎదిగేందుకు రెండు నెలల సమయం పడుతుంది. ఈ కాలంలో కోడి మూడున్నర కిలోల దాణా తింటుంది. కిలో దాణాకు రూ.60 వ్యయం అనుకుంటే, మూడున్న ర కిలోలకు రూ.210 వరకు ఖర్చు వస్తుంది. దీంతో బ్యాచ్‌లు వేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

కొత్త బ్యాచ్‌లు వేయలేదు

చికెన్ ధరలు ఏడాదిలో ఒకటి లేదా రెండు నెలలు మాత్రమే గిట్టుబాటు ధర వస్తుంది. మిగిలిన కాలమంతా నష్టాలు తప్పటంలేదు. ప్రస్తుతం లైవ్ కేజీ రూ.108 చొప్పున కొనుగోలు జరుగుతుంది. లేని పక్షంలో ధరలు ఇంకా నేలను తాకే అవకాశాలు లేకపోలేదు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక తొలుత పౌల్ట్రీ రంగం నష్టపోవటంతో పాటు అనుబంధ వ్యాపారాలపైనా ప్రభావం చూపుతోంది. ఉపాధి దెబ్బతింటోంది.

- కె.శ్రీనివాసరావు, చికెన్ హోల్‌సేల్ వ్యాపారి

కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న

డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరించాలి

కమిషనర్ కేతన్‌గార్గ్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని శ్యామల సెంటర్‌లో డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరించాలలి, చిన్న వర్షానికే ముంపు బారిన పడుతున్న పరిస్థితి ని మార్పుచేసే చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్‌కు సిపిఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్ కమిషనర్ దృష్టికి ముంపు సమస్యను తీసుకెళ్లారు. రాజమహేంద్రవరం నగరం ముఖ ద్వారంగా ఉన్న శ్యామల సెంటర్‌లో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై రెండు అడుగులు ఎత్తులో నీరు నిలబడి పోతుందని తెలిపారు. నగర ప్రజానీకం, మార్కెట్‌కు వచ్చిన వర్తకులు, కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షపు నీరు నిలబడకుండా, ముంపు నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డుకు రెండు వైపులా పెద్ద డ్రెయినేజీలు ఉన్నాయన్నారు. అయితే అవి 90శాతం సిల్ట్‌తో నిండిపోయాయని తెలిపారు. వర్షపు నీరు వీటి గుండా ప్రవహించడానికి వీలు లేక పోవడంతో మొత్తం రోడ్డు పైనే నిలిచిపోతుందన్నారు. వర్షం వచ్చిన సమయంలో డ్రెయినేజీలో ఉన్న చెత్త బయటకు వచ్చి రోడ్డుపైకి చేరుతుందన్నారు. దీంతో తీవ్రమైన దుర్గంధం వస్తుందన్నారు. డ్రెయినేజీపై సిల్ట్ తీయడానికి ఏర్పాటు చేసిన స్లాబులు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయన్నారు. వీటికి తక్షణమే ఐరన్ మూతలను బిగించాలన్నారు. అవసరం లేని భాగాలను పూర్తిగా మూసి వేయాలన్నారు. ఇన్నీసు పేట అర్బన్ బ్యాంకు ఎదురుగా అసంపూర్తంగా వదిలేసిన రోడ్డును పూర్తి చేయాలని కోరారు. ఈ సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. డ్రెయినేజీల్లో పూడిక తీయిస్తామని తెలిపారు.

నేడు గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం శత వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం(కస్తూర్బాసంస్థ) శత వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమం ప్రతినిధి సుశీల తెలిపారు. గాంధేయ నిర్ణయ కార్యక్రమాలు చేపట్టే నిమిత్తం ఈ ఆశ్రమాన్ని 1924 నవంబర్ 9న డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం స్థాపించారన్నారు. కొన్ని వందల మందికి స్వాతంత్రోద్యమంలో పాల్గొనేందుకు ఇక్కడ శిక్షణ ఇచ్చారన్నారు. మహాత్మా గాంధీ రెండు మార్లు, కస్తూర్బా గాంధీ ఒకసారి ఈ ఆశ్రమాన్ని సందర్శించారని గుర్తు చేశారు. వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం 1936లో మరణించారన్నారు. అప్పటి నుంచి ఆశ్రమ నిర్మాణ కార్యక్రమాలు కుంటుబడ్డాయన్నారు. ఖద్దరు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడకుండా ధరణిప్రగడ శేషగిరిరావు ఈ ఆశ్రమంలోనే ఉన్నారని తెలిపారు. 1946 జూన్ 9న కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక సంస్థగా ఇది మార్పు చెందిందన్నారు. దుర్గాబాయ్ దేశముఖ్ ప్రథమ ప్రతినిధిగా ఉంటూ సంస్థను తీర్చిదిద్దారన్నారు. నాటి నుంచి నేటి వరకు గ్రామీణ స్త్రీ, పిల్లల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు ఆశ్రమంలో చేపట్టారన్నారు.. గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం స్థాపించి నేటితో నూరు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా శతవార్షికోత్సవ వేడుకలు ఉదయం పదకొండు గంటలకు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా శత వార్షికోత్సవ వేడుకల స్థూపం, జ్ఞాపిక ఆవిష్కరణ, దక్షిణ సబర్మతి - గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం అను నామకరణంతో గ్రంథావిష్కరణ, ఆశ్రమం నివాసుల విగ్రహాల ఆవిష్కరణలు ఉంటాయన్నారు.

సీతానగరంలో గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం

ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెరవలి

మండలం తీపర్రు ఇసుక ర్యాంపు-2 పశ్చిమ గోదావరి జిల్లాకు స్టాక్ పాయింట్‌గా కేటాయించడంతో శుక్రవారం నర్సాపురం ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ డి.అచ్యుతకుమారితో కలిసి పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లో నిల్వ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పెనుగొండ తహశీల్దార్ అనిత, ఆచంట, తాడేపల్లిగూడెం తహశీల్దార్లు, తణుకు డిటి, రెవెన్యూ అధికారి పావని, సిబ్బంది తదితరులున్నారు.

గ్రామీణుల ఆరోగ్యం కాపాడుదాం

ప్రజాశక్తి - నల్లజర్ల

మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం బాధ్యతగా భావించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ జె.సంధ్య వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పలు మారుమూల గ్రామాలను ఆమె సందర్శించారు. అచ్చన్నపాలెంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల్లో పోషకాహార లోపాలను గుర్తించడం, కౌమార దశలో ఉన్నా బాలికలు, మహిళల్లో రక్తహీనత అరికట్టడం, అంటువ్యాధుల నివారణ చర్యలు, మాతా శిశు మరణాలు వంటివి లేకుండా చూడాలని సూచించారు. హితవు పలికారు. ముఖ్యంగా గ్రామీణులకు ఆరోగ్యంపై అవగాహన కలిగించేలా విస్తత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉద్దీన్, సిహెచ్ఒ పలివెల ప్రసాదరావు, ఆరోగ్య కార్యదర్శి సిహెచ్.జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పి పల్లి మణి, 104 సిబ్బంది, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉచిత కోచింగ్ వాయిదా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉండటంతో మెగా డిఎస్‌సి ఉచిత కోచింగ్‌కు నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేశామని జిల్లా సంక్షేమ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

కార్టూ'నిజం'



డిసెంబర్ 1న బాలల కథా రచన పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

బాల మందిరం, గోదావరి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి బాలల కథా రచన పోటీలు-2025ను డిసెంబర్ 1న నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ పోటీలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షుడు వివిఎస్.కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.తులసి, బాల మందిరం వ్యవస్థాపకులు అంగర గోపాలకృష్ణ (కృష్ణశ్రీ) తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 4 నుంచి 10వ తరగతి వరకు చదివే వారందరూ ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఈనెల 25 వరకు 9963163136, 9492249377 నెంబర్ల ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు.

విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కృష్ణశ్రీ తదితరులు

పోటీల్లో పాల్గొనేందుకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదన్నారు. కథలు చదవడం, రాయడం, దానిలో నీతి ఇతర విషయాలను తెలుసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వాటి నుంచి ఎంపికైన 80 కథలను బాలల కథా సంపుటి-2025 పేరుతో ఒక పుస్తక రూపంలో ముద్రించి జనవరిలో ఆవిష్కరించాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. గతంలో నానమ్మ, తాతయ్యలు కథలు చెప్పే వారని, నేటి కాలంలో తల్లితండ్రులు, నానమ్మ, తాతయ్యలు ఇతర వ్యాపకాల్లో ఉండటంతో విద్యార్థులు సెల్‌ఫోన్‌కు అంకితం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల వారిలో గ్రాహక శక్తి తగ్గిపోవడంతో పాటు కథల వల్ల జరిగే ప్రయోజనాల్ని కూడా అందుకోలేకపోతున్నారని తెలిపారు. కథలు వినడం, చదవడం, రాయడంపై ఆసక్తి కల్పించడంతో పాటు కథల ద్వారా వారికి తెలుగు భాషపై పట్టు, భావ వ్యక్తీకరణ, నాటకీకరణ వంటి విషయాలన్ని అర్థమవుతాయన్నారు. గతంలో నిర్వహించిన గోదావరి బాలోత్సవం విద్యార్థుల్ని అద్భుతంగా ఆకట్టుకుని విజయం సాధించిందని, ఈ విధంగా బాలల కథా రచన పోటీలు కూడా సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. పాఠశాలల యాజమాన్యాలు, తల్లితండ్రులు విద్యార్థుల్లో ఉన్న ఆసక్తిని ప్రోత్సహించి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. దీనిపై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లిఖార్జునరావు, నవీనకుమారి, అంజలి, జార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల నుంచి పంటను కాపాడండి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కోళ్ల ఫారం నుంచి వచ్చే వ్యర్థాల నీటితో పంటలను నష్టపోతున్నామని, తాడిపర్రు కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు తహశీల్దార్ పివిఎన్‌డి.ప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. పదేళ్లుగా ఇదే విధంగా కష్టపడి పండించిన పంటను నష్టపోయి, కౌలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తాడిపర్రు గ్రామానికి చెందిన సుమారు 20 మంది అదే గ్రామంలో కౌలుకు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరు సాగు చేస్తున్న భూములకు నీటిని అందించే పంట బోదెలో ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కోళ్ల ఫారాల యజమానులు వ్యర్థాలను విడిచి పెడుతున్నారు. ఫలితంగా తమ పంటలు పాడైపోతున్నాయని, పౌల్ట్రీ యజమానులతో ఎన్నిసార్లు విన్నవించినా వినిపించుకోవట్లేదన్నారు. అర్ధరాత్రి వేళల్లో పౌల్ట్రీ వ్యర్థాల నీటిని పంట కాలువలోకి వదిలేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై గతంలో తహశీల్దార్ హెచ్చరికతో కొద్ది రోజులు నిలిపేశారన్నారు. తిరగి మళ్లీ వ్యర్థజలాలలను బోదెల్లోకి విడిచిపెట్టేస్తున్నారని తెలిపారు. దీంతో సమస్య మొదటికొచ్చిందని వారు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందిని గమనించి, మార్టేరు రైతు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలకు తెలియజేస్తామని, వారు వచ్చి పంటలను పరిశీలిస్తారని తెలిపారు. తహశీల్దార్ ప్రసాద్ వ్యర్థాలను వదులుతున్న పౌల్ట్రీ ఫారంను, రైతులతో కలిసి సందర్శించారు. పంట పొలాలను పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి, పరిష్కరిస్తామని తెలిపారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌలురైతులు

ఎఫ్ఆర్‌ఎస్‌పై పునరాలోచన చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాలకు - ఎఫ్ఆర్ఎస్ లింక్ అంశంపై పునరాలోచన డిఎంహెచ్ఒ ద్వారా ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్‌కు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు వైద్య ఆరోగ్య శాఖలో నిరంతరం రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉన్న విద్యార్హతలు, నియమాకపు విధానాలు డిఎస్‌సి, ఆర్ఒఆర్ మెరిట్ ఆధారంగా తమను నియమించారన్నారు. చాలీచాలని వేతనాలతోనే నెట్టుకొస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేస్తారనే నమ్మకంతో విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. కాని అక్టోబర్ నెల వేతనాలకు ఎఫ్ఆర్ఎస్‌ను లింక్ చేసి కొత విధించడం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు తీవ్రమైన ఆర్థిక నష్టం జరిగిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులందరికీ ఎఫ్ఆర్ఎస్‌తో జీతాలకు అనుసంధానం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడం ఆందోళన కలిగిస్తుందన్నారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు నెట్ సమస్యతో ఎఫ్ఆర్ఎస్ ఒక్కోసారి 10నిమిషల వరకు లేట్ అయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. 10 నిమిషాలు దాటితే ఎఫ్ఆర్ఎస్ తీసుకోవడానికి కష్టమవుతుందన్నారు. అతి తక్కువ వేతనాలకు తోడు వేతనాల్లో కోత పెడితే ఉద్యోగులు మరింత నష్టపోతారన్నారు. పబ్లిక్ హాలిడేస్‌లో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వేయాలనే సంకేతాలు, షిఫ్ట్ డ్యూటీల్లో, వీక్లి ఆఫ్, డే ఆఫ్ మొదలగు సందర్భాలలో ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయకపోవడం వలన ఉద్యోగులకు అబ్సెంట్ నమోదవుతుందన్నారు. కావున ఆలోచించి మార్పులు చేయాలని, ఎఫ్ఆర్ఎస్‌లో లోపాలను పూర్తిస్థాయిలో సవరించాలని, కోత విధించిన అక్టోబర్ వేతనాలు తిరిగి చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎపిఎన్‌హెచ్‌ఎం జెఎసి చైర్మన్ దయామణి, జాయింట్ సెక్రెటరీ సుధీర్‌బాబు, రాజమండ్రి అర్బన్ యుపిహెచ్‌సి నాయకులు రాజశేఖర్, సుజాత, విజయలక్ష్మి, సుస్మిత, రమ్యకృష్ణ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రాము, ప్రియాంక, సౌజన్య ఎన్‌హెచ్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ సిబ్బంది

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం అందించాలి

ప్రజాశక్తి- కడియం

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం అందించాలని జేగురుపాడుకు చెందిన రైతు పెనుమర్తి వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తనకు 15 ఎకరాల్లో 60 ఏళ్ల నుంచి వరిని సాగు చేస్తున్నానని తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నానని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించాలనే ఆలోచనతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం తాను ఒక ఎకరం పొలంలో సేంద్రియ పద్ధతిలో స్వర్ణ రకం వరిని పండించానని తెలిపారు. ఎకరాకు 45 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చినట్లు తెలిపారు. రైతులందరూ ఆరోగ్యకరమైన సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆవలంబించాలని, తక్కువ పెట్టుబడుతూ ఎక్కువ ఆదాయం సంపాదించాలని కోరారు. అలాగే ప్రకతి పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- కడియం

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్ బుక్‌లో ఈ నెల 7న 'చూడ చక్కని హెరిటేజ్ పాల్' అనే ఫేక్ ఐడితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణి తదితరుల ఫోటోలను మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టినట్లుగా కడియం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. అసభ్యకరంగా దూషిస్తూ, మహిళలను కించపరుస్తూ, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్ట్ పెట్టినట్లు టిడిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి చెరుకూరి వెంకట ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి : రమేష్

ప్రజాశక్తి - నిడదవోలు

ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎపిపిటిడి ఎపిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రంగా రమేష్ తెలిపారు. ఆయన శుక్రవారం యూనియన్ గౌరవ అధ్యక్షులుగా నియమితులయ్యారు. నూతన కమిటీ అధ్యక్షులుగా తాడిమల్ల శ్రీనివాస్, కార్యదర్శిగా ఎమ్‌డి మోహిద్దీన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముస్తఫా, ట్రెజరర్‌గా ఎస్.సత్తిబాబు, అడిషనల్ సెక్రటరీగా బి.అప్పారావు ఎన్నికయ్యారు. తొలుత రంగా రమేష్ డిపో మేనేజర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆర్‌టిసి డిపో కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రపంచ మానవహక్కుల అవగాహనా సంఘం జిల్లా చైర్మన్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ మానవహక్కుల అవగాహనా సంఘం(గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్) జిల్లా చైర్మన్‌గా ఎం.శ్రీనివాసరావు నియమితులయ్యారు. అసోసియేషన్ జాతీయ చైర్మన్ కె.కోనయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర చైర్మన్ బివి.గణేష్ ఈ నియామకం చేపట్టారు. నియామక ఉత్తర్వులను విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో కోనయ్య, గణేష్‌ల నుంచి శ్రీనివాసరావు అందుకున్నారు. ఈ సందర్భగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉత్తర్వులు అందుకుంటున్న శ్రీనివాసరావు

గోపాలపురం ఎలక్ట్రికల్ ఎఇగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఎలక్ట్రికల్ ఎఇగా డి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కన్‌స్ట్రక్షన్ ఎఇగా నిడదవోలులో పనిచేశారు. సాధారణ బదిలీలో భాగంగా గోపాలపురానికి వచ్చారు. ఈ సందర్భంగా లైన్‌మెన్‌లు, సిబ్బంది ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

నర్సరీల్లో మహిళా కూలీల భద్రతపై శ్రద్ధ

ప్రజాశక్తి- కడియం

నర్సరీల్లో పనిచేసే మహిళల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కడియం ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న తెలిపారు. సౌత్ జోన్ డిఎస్‌పి ఎస్.భవ్యకిషోర్ ఆదేశాల మేరకు కడియం సిఐ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని దుళ్ల గ్రామ నర్సరీల్లో పనిచేసే మహిళలకు శుక్రవారం ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పనులకు వచ్చేటప్పుడు ఇంటికి వెళ్లేటప్పుడు అందరూ కలిసి వెళ్లేలా చూసుకోవాలన్నారు. నర్సరీల్లో పనిచేసే మగవారి ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నర్సరీల్లో చిన్నపిల్లలను పనులలో పెట్టుకోరాదని యజమానులకు సూచించారు.

సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరిస్తాం...

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - రాజానగరం

విశిష్ట చరిత్ర గల ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ జరుగుతున్న 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు శుక్రవారంతో ముగిసింది. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. నన్నయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. కోస్తా తీరం నాగరికతకు పెట్టింది పేరు. ఇక్కడ ఎన్నో కళారూపాలు ఉన్నాయని, వాటిని సినిమా వైపు మాత్రమే కాకుండా స్వీయ అభిలాషతో స్వీకరించి ఆదరించాలన్నారు. తెలుగు వారికి మాత్రమే ఉన్న గొప్ప సాహిత్య రూపం పద్య నాటకం, పౌరాణిక నాటకాలు అన్నారు. కేరళను మించిన అందాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయన్నారు. తెలుగు భాష చాలా ప్రాచీనమైన భాష అని, దానికి లిఖిత పూర్వక ఆధారాలు భద్రపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి ప్రపంచ దేశాలకు తెలియ చెప్పాలన్నారు. రాష్ట్రం నలుమూలల ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి సంస్కృతి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. చరిత్రను అర్థం చేసుకుంటేనే భవిష్యత్‌ను నిర్మించుకోగలమని అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో బలంగా నిలబడటానికి నేడు ఉన్న మంచి టీమ్ కృషి చేస్తుందని, వారికి సహకారాన్ని అందిస్తామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేందుకు పాటుపడ తామని చెప్పారు. వీరేశలింగం వంటి సంఘ సంస్కర్త దేశాన్ని చైతన్య పరిచారన్నారు. మరో ముఖ్య అతిథి ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ మంత్రులు కందుల దుర్గేష్, నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబు సహకారంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. విశ్వవిద్యాలయానికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్ని స్తామని తెలిపారు. విసి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ మంచి మార్గంలో చక్కని వాతావరణంలో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కాప్స్ వారి 'ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం' అనే పుస్తకాన్ని, విసి వై.శ్రీనివాసరావు రూపొందించిన జియలాజికల్ మ్యాప్‌ను, ఆంధ్ర శక్తి వారి ఈట్ టూ ఫీడ్ పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. ముఖ్య అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సిహెచ్.విజయానందఆదిత్య, కాప్స్ సెక్రటరీ ఓలేటి సత్యనారాయణ, కన్వీనర్లు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

మంత్రి దుర్గేష్‌కు జ్ఞాపికను అందిస్తున్న శ్రీనివాసరావు, సదస్సు నిర్వాహకులు

జిజియులో జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స చాట్ జిపిటి అనువర్తనాలపై జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. 20కి పైగా గ్లోబల్ టెక్ కంపెనీలకు చెందిన నిపుణులు, ఎవన్ స్పెషలిస్ట్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఛాన్సలర్ కెవివి.సత్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా బెంగుళూరులోని కరిష్మా కార్పొరేషన్ ఛైర్మన్, సిఇఒ, ఇండో-అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డాక్టర్ రాజ్ మత్యుంజయప్ప హాజరైర మాట్లాడారు. విద్యలో ఎ-వన్ విప్లవాత్మక మార్పులను వివరించారు. భవిష్యత్తులో ఎ-వన్ ద్వారా విద్యార్థులకు వ్యక్తిగత అనుభవాలు, సూచనలు అందడం వీలవుతుందన్నారు. ఇది విద్యారంగంలో పెద్ద మార్పునకు నాంది అని చెప్పారు. సభా అధ్యక్షుడు చైతన్యరాజు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు పోటీ ఎదుర్కోవడానికి ఈ సదస్సులు అవసరం ఉందన్నారు. గైట్ కళాశాల డైరెక్టర్ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ ఎ-వన్ శక్తివంతమైన ప్రభావాన్ని వివరించి, భారతదేశంలో ఉన్నతమైన శిక్షణా వేదికగా జిజియు ముందుకు సాగుతుందన్నారు. దీనిలో కాంటినెంటల్ ఇండియా ప్రెసిడెంట్, సిఇఒ ప్రశాంత్ దొరస్వామి ఆటోమొబైల్ రంగంలో ఎ-వన్ అన్వయాలు, వినియోగాల గురించి వివరించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఎఐను నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. విసి డాక్టర్ యు.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. డాక్టర్ బి.సుజాత, డాక్టర్ ఆర్.తమిళకోడీ, డాక్టర్ కె.వల్లిమాధవి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

ఇసుక కోసం వెళ్లి మగ్గురు మృతి

మరొకరు గల్లంతు, తూర్పు లక్ష్మీపురంలో తీవ్ర విషాదం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

అడ్డతీగల మండలం బొంగరాలపాడు గ్రామం వద్ద ఏలేరు కాలువలో ఇంటి నిర్మాణానికి ఇసుక తవ్వడానికి వెళ్లిన ముగ్గురు మృతి చెందారు. మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమల్ల భూషణం ఇంటిని నిర్మించుకుంటున్నాడు. దీని కోసం ట్రాక్టర్‌తో ఇసుక తెచ్చుకునేందుకు బొంగరాలపాడుకు వీరమల్ల భూషణం, అతని కుమారుడు వీరమల్ల జయబాబు, మేనల్లుడు తాళ్లూరు మండలం లక్ష్మీదేవరపల్లికి చెందిన వి.చిన్నగొంతియ్య, తూర్పు లక్ష్మీపురం గ్రామానికి చెందిన చింతా శ్రీనివాస్ మరో వ్యక్తి కలిసి వెళ్లారు. ఇసుక లోడు చేస్తుండగా గమేళా కాలువలో కొట్టుకుపోయింది. గమనించి వారు గమేళా కోసం ఆలోచించకుండా ఐదుగురూ ప్రవాహంలోకి దిగారు. ఒక వ్యక్తి తప్పించుకోగా భూషణం(52), జయబాబు(26), వి.చిన్న గొంతియ్య(30), చింతా శ్రీనివాస్(16) గల్లంతయ్యారు. బంధువులు, స్థానికులు గజ ఈతగాళ్ల సహాయంతో అడ్డతీగల పోలీసులు గాలింపు చేపట్టారు. జయబాబు, చిన్న గొంతియ్య, శ్రీనివాస్ మృతదేహాలను గుర్తించారు. వీరమల్ల భూషణం ఆచూకీ ఇంకా తెలియరాలేదు. చీకటిగా ఉండటంతో సహాయ చర్యలు కష్టతరంగా మారాయి. ఘటనా స్థలానికి ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, రంపచోడవరం ఎంఎల్ఎ మిరియాల శిరీష, ఐటిడిఎ అధికారులు చేరుకున్నారు. మృతుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఎంఎల్ఎ తెలిపారు. గల్లంతైన భూషణానికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు జయబాబు ఈ ఘటనలో మృతి చెందాడు. మరో మృతుడు శ్రీనివాస్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది.

మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ

మృతులు

శ్రీనివాస్

గొంతియ్య


జయబాబు

బాధితుడిని పరామర్శిస్తున్న జువ్వల రాంబాబు

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - నిడదవోలు

ఉండ్రాజవరంలో ఫ్లెక్సీలు కడుతూ విద్యుదాఘాతానికి గురైన మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. ఇదే ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు కోమటి అనంతరావును ఆయన శుక్రవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘటన బాధాకర మన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు

బాధితులకు సాయం అందిస్తున్న అభిరామ్

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అభిరామ్ చేయూత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సింగవరం గ్రామంలో అగ్నిప్రమాద బాధితులకు మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్ చేయూతనందించారు. అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ఘటనలో రూ.2లక్షల నగదు, పది కాసుల బంగారం, సర్టిఫికెట్లు, ఇతర వస్తువులు అన్నీ కాలిపోవడంతో బాధితులు రోడ్డున పడ్డారు. తెలుసుకున్న పెందుర్తి అభిరామ్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఘటనపై రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణతో మాట్లాడి వ్యక్తిగతంగా, ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెవిలో పూలతో క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

బకాయి జీతాలు చెల్లించాలని క్లాప్ డ్రైవర్లు చేస్తున్న ఆందోళన శుక్రవారం 15వ రోజు చేరుకుంది. నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని చెవిలో పూలు పెట్టుకుని డ్రైవర్లు మున్సిపల్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ నిరసనలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకపోతే జిల్లాలో పంచాయతీ వర్కర్లందరూ వారికి మద్దతుగా ఆందోళన చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించరాఉ. డ్రైవర్లకు జిఒ నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, శివశంకర్, కొండబాబు, గంగాధర్, కుమార్, భైరవ స్వామి, టీ శ్రీను, దుర్గ బాబు, రాజు, సూరిబాబు మొదలైన వారు పాల్గొన్నారు.

చెవిలో పూలతో నిరసన తెలియజేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

ఎఒ వెంకటరెడ్డిపై కార్యదర్శుల ఆగ్రహం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ డిఎల్‌పిఒ కార్యాలయంలో ఎఒ వెంకటరెడ్డిపై పంచాయతీ కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల ప్రాతిపదికగా పంచాయతీ కార్యదర్శులను విభజించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మహిళా కార్యదర్శుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షులు జె.నరసింహారావు ఆధ్వర్యంలో సుమారు పది మంది పంచాయతీ కార్యదర్శులు వెంకటరెడ్డిపై డిపిఒ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నరసింహారావు, తూరంగి పంచాయతీ కార్యదర్శి జెవి.రమణమ్మ తదితరులు మాట్లాడుతూ వెంకటరెడ్డి కుల వివక్షతో ఎస్‌సి, ఎస్‌టి పంచాయతీ కార్యదర్శులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆయా కార్యదర్శులపై పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేయించి వాటిని క్లోజ్ చేయాలంటే డబ్బులు అడుగుతున్నారన్నారు. మహిళా కార్యదర్శుల దుస్తులపై చులకన భాగంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరిద్దరు కార్యదర్శులు వెంకటరెడ్డి వేదింపులతో తాళలేక ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడడానికి సిద్ధమయ్యారని, వారిని తాము వారించామన్నారు. ఈ విషయమై రూరల్ ఎంఎలఎ నానాజీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

ఫిర్యాదు చేయడానికి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు

శివన్నారాయణపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి- తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో మాజీ సర్పంచ్ కుడుపూడి శివన్నారాయణ పేదల కోసం కళ్యాణ మండపం నిర్మించారని, ఆ నిర్మాణంపై, శివన్నారాయణపై సోషల మీడియాలో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పలువురు హితవు పలికారు. గ్రామస్తులు పెచ్చెట్టి సత్యనారాయణ, కాదా సాయిబాబా, అనుసూరి శ్రీను, న్యాయవాది యడ్ల కుటుంబరావు తదితరులు శివన్నారాయణ స్వగృహం వద్ద నుంచి వెళ్లి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును కలిసి పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మట్టపర్తి నూకరాజు, మేడిశెట్టి లక్ష్మి, విత్తనాల సత్యవతి, దున్న ఎల్లారావు, దున్న మురళి, గుత్తుల సత్యనారాయణ, రాము, కొప్పుల అబ్బులు పాల్గొన్నారు.

నమ్మకమైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఆసుపత్రికి వస్తే వైద్యం బాగా అందిస్తారని నమ్మకం కలిగించేలా రోగులకు వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి పి సత్యకుమార్ సూచించారు. శుక్రవారం కాకినాడలోని నూకాలమ్మ గుడి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్వే సంజీవిని ఆసుపత్రిని మంత్రి సత్య కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వైద్యం పేదలకు చాలా దూరంలో ఉందన్నారు. దాని వల్ల పేద ప్రజల రకాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పేద ప్రజలు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతులను, సేవలను పెంచి వాటిని మెరుగుపరుస్తున్నామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

రెండు గేదెలు అపహరణ

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం దుళ్ల గ్రామంలో బేదంపూడి రామకృష్ణకు చెందిన మకాంలో రెండు గేదెలు, రెండు దూడలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుని పోయినట్లు కడియం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలం బోడసకుర్రు వంతెన వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా మరో వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ రోడ్డు ప్రమాదంలో మామిడి కుదురు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన కాంట్రేకుల సత్యనారాయణ సంఘటన స్థలంలో మతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలు కాగా గాయాలు పాలైన వ్యక్తిని అమలాపురం కిమ్స్ హాస్పిటల్ కి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేపట్టారని అమలాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వీరబాబు. అల్లవరం సబ్ ఇన్స్పెక్టర్ హరీష్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

చోరీ కేసుల్లో నిందితుని అరెస్టు చేసిన రూ.5 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నఉట్ట కాకినాడ రూరల్ సిఐ డిఎస్ చైతన్య కృష్ణ తెలిపారు. ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్తుడు బత్తుల లక్ష్మణరావును తూరంగి రోడ్డు బాలయోగి సెంటర్ వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. అతడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపరాఉ. ఈ సమావేశంలో ఇంద్రపాలెం ఎస్ఐ కె.వీరబాబు, క్రైమ్ పోలీసులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలో రాచపల్లి గ్రామానికి చెందిన 8వ తరగతి బాలిక కిడ్నాప్ కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు సిఐ సూర్య అప్పారావు తెలిపారు. బాలికను అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పెదిరెడ్డి కృపారాజు తన కూతురు, కొడుకుతోపాటు రోజూ స్కూల్‌కు ఆటోలో తీసుకు వెళుతూ బాలికకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేశాడని సిఐ తెలిపారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట శివారు గోకవరం రోడ్డులో ఉన్న పోలవరం కాలువలో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సత్యవేణి పేటకు నక్కా ఏసమ్మకు తొలుత ఒక వ్యక్తితో వివాహం అయ్యింది. అనంతరం వారు విడాకులు తీసుకున్నారు. జగ్గంపేటకి చెందిన వెలుగుల వీరదుర్గా ప్రసాద్, ఏసమ్మ ప్రేమించి వివాహం చేసుకుని జగ్గంపేటలో ఉంటున్నారు. ఈ నెల 6న ఏసమ్మ తన భర్తను సినిమాకు తీసుకెళ్లమంది. సమయం అయిపోయింది తర్వాత వెళ్దాం అని చెప్పగా ఏసమ్మ కోపగించింది. అనంతరం ఆమె కనిపించకపోవడంతో శుక్రవారం గోకవరం రోడ్డులో ఉన్న పోలవరం కాలువలో ఏసమ్మ మృతదేహాన్ని గుర్తించారు. తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రాచపల్లి జంక్షన్ వద్ద 21 కేజీల గంజాయితో ఒక యువకుని అరెస్టు చేసినట్టు సిఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. నల్గొండ జిల్లాకు చెందిన కోలా మణికంఠ గంజాయినిరవాణా చేస్తుంటాడని తెలిపారు. ఈ గంజాయిని ఒడిషా అటవీ ప్రాంతం నుండి హైదరాబాద్‌కు తరలిస్తూ శుక్రవారం జాతీయ రహదారి రాచపల్లి జంక్షన్ వద్ద పట్టుబడ్డట్టు తెలిపారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై యువతకు అవగాహన

ప్రజాశక్తి - యానాం

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఐటిఐ కళాశాలలో యువతీ యువకులకు మాదకద్రవ్యాల వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్ఎఒ మునిస్వామి పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల ఆరోగ్యం పాడవ్వడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిప్మర్, సైకియాట్రిక్ డాక్టర్ ప్రేమ్ సాయి, రిటైర్డ్ సిఐ గూటం శివ గణేష్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, ఐటిఐ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, యువజన అధికారి తిర్రి గోపి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంఎల్ఎ అశోక్ తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుక్రవారం పలు ప్రభుత్వ శాఖలను తనిఖీ చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజల నుండి అనేక ఫిర్యాదులు రావడంతో అధికారులను నేరుగా కలిసి, ప్రజలు పనులు మానుకుని కార్యాలయాలు చుట్టూ తిప్పించుకోవడం సబబు కాదని వారికి అవసరమైన సర్టిఫికెట్లను వీలైనంత త్వరగా అందజేయాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్ శాఖ ద్వారా వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసినా ఇప్పటివరకు మంజూరు పత్రాలను అందజేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి ప్రకాష్‌బాబు

గోకవరంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - గోకవరం

మండల కేంద్రమైన గోకవరం మండల మహిళా సమాఖ్య భవనంలో కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఎసిడిపిఒ పి.వరలక్ష్మి ఆధ్వర్యంలో మహిళ న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయమూర్తి కె.ప్రకాష్‌బాబు, న్యాయవాదులు పద్మావతి, సుజాత, డిసిపిఒ రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భిన్న వృత్తుల గల మహిళలకు విధాన్ సే సమిధాన్ కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. మహిళలు చేస్తున్న పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న వివిధ రకాల ఇబ్బందులు, హెల్ప్ లైన్ గురించి, చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు పి.ఇందిరా రాణి, ఎల్.రంజని, పి.చంద్రమ్మ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SAYYAPARAJU PRUDHVI RAJU, S/o. S.SUBBA RAJU, D.No. 4-148, Opposite Surya Chandra School, Sethanagaram Mandal, China Kondepudi, E.G.District, A.P. I have changed my name from **SAIPARAPU PRUDHVI RAJU** (Old Name) to **SAYYAPARAJU PRUDHVI RAJU** (New Name). Hence forth Iam being called **SAYYAPARAJU PRUDHVI RAJU**, S/o. S.Subbaraju for all purpose.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం, జగ్గంపేట గ్రామానికి చెందిన కొల్లూరి దయారత్నం, W/o. శివరామకృష్ణకు చెందిన శెటిల్‌మెంట్ దస్తావేజు పడిపోయినది. **సర్వే నెం. 34-1 లో య. 0.05 ట్లు** సంబంధించిన దస్తావేజులు జిరాక్స్ నిమిత్తం తీసుకొని వెళ్ళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలుపగలరు.

సెల్: 99121 43124

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
ఓ.పి. నెంబర్ 241/2023

Between:
గుండుపల్లి వీర వేణి @ వినయరత్నం -పిటిషనర్
మరియు
గుండుపల్లి దీనరాజు, తండ్రి: కామరాజు, వయస్సు 37 సం॥రాలు, ఇంటి నెంబర్: 4-105, రామేశ్వరం, పెదపూడి మండలం, కాకినాడ, కాకినాడ జిల్లా. -రెస్పాండెంట్

సదరు పై నెంబర్ విడాకుల కేసులో మీరు రెస్పాండెంట్ అయ్యి ఉన్నారు. పై నెంబర్ దావాలో శ్రీ కోర్టు వారి నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా మీరు కాలయాపన చేయుచున్నారు. పై నెంబర్ దావా **ది. 19-11-2024వ సం॥ తేదీన వాయిదా అయి ఉన్నది.** కావున మీరు పై తేదీన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై దావా తమ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

కారిపల్లి శ్రీరామచంద్రమూర్తి
కాకినాడ పిటిషనర్ తరపు న్యాయవాది
9-11-2024 కాకినాడ, సెల్: 8019991957

వ్యవసాయ భూమి తాలూకా ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం, వేగాయమ్మపేట శివారు, కుందాలమ్మ చెరువు కాపురస్తులు చొల్లంగి వెంకట రాజు (లేటు) కుమారుడు చొల్లంగి వెంకట రామారావు కుందాలమ్మ చెరువు మా ఇంటి పని పరిశీలించుకుని తిరిగి ఇంటికి వెళుచుండగా ఆర్.టి.సి. కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి నాయొక్క దస్తావేజులు మరియు నాభార్య శ్రీమతి చొల్లంగి సుదర్శిని యొక్క దస్తావేజులు ఒరిజినల్ బ్యాగ్ పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. నా యొక్క బ్యాగ్ (దస్తావేజులు నెం.1 చొల్లంగి వెంకట రామారావు S/o. వెంకటరాజు మరియు నా భార్య దస్తావేజులు 1) నెం. 2025/2001, 2) నెం. 2024/2001 గలవి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు ఇవ్వగలరు.

చొల్లంగి వెంకట రామారావు
S/o. వెంకటరాజు, డో.నె. 5-15
కుందాలమ్మ చెరువు, వేగాయమ్మపేట గ్రామ పంచాయతీ
రామచంద్రపురం మండలం
డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ నెం.9959187037

ప్రకటన

మహారాజశ్రీ కాకినాడ IV వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 669/2019

Between:
దూళ్ళ వరలక్ష్మి -వాది
AND
మాదారపు విజయకుమార్, ప్రైవేటు ఎంప్లాయి, S/o. (లేటు) సుబ్రహ్మణ్యం, తిమ్మాపురం గ్రామం, కాకినాడ రూరల్ మండలం. -ప్రతివాది

మీకు పై కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు, నోటీసులు పంపించినను సదరు నోటీసులు మీరు బుద్ధిపూర్వకముగానే నోటీసు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు **ది. 13-11-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు.** సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపరచుకొనవలెను. లేని యెడల పై నెంబరు దావాలో మీకు పరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

సిహెచ్.శ్రీనివాసకుమార్
అడ్వకేటు, పిఠాపురం
సెల్: 9759269999

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, కొత్తపేట
E.P. 2/2021, O.S. 110/2010

Between:
గంజి సత్యనారాయణ, వగైరా -DHr /వాదులు
మరియు
సమయమంతుల వెంకటేశ్వరరావు, వగైరా -JDrs /ప్రతివాదులు

To:
JDr-3: సమయమంతుల తపస్వి ఆండాళ్, W/o. వెంకటేశ్వరరావు, హిందూ, 28 సం॥లు, గృహిణి, డో.నెం. 6-50, ర్యాలి గ్రామం, ఆత్రేయపురం మండలం, కోనసీమ జిల్లా.

మీకు పై గ్రంథములో ఎన్ని పర్యాయములు సమను పంపినప్పటికీ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ద్వారా మీకు నోటీసు అమలుకు ఆర్డరు వేసినారు. కావున మీరు పై కోర్టు వారి ఎదుట **ది. 02-12-2024వ తారీఖున ఉదయం గం॥ 10.30 నిమిషములకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క వాదనను తెలుపుకోవలసినది. లేని యెడల మీకు పరోక్షమున తీర్మానము చేయబడును అని తెలియచేయడమైనది.

T.M.K.SARMA, Advocate
Kothapeta, Cell: 9849564708